క్లుప్తంగా

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

కారెంపూడి: మండలంలోని గాదెవారిపల్లె విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ పరిధిలోని గ్రామాలలో శుక్రవారం విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ కె.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్‌ సరఫరా ఉండదని పేర్కొన్నారు. గాదెవారిపల్లె, బట్టువారిపల్లె, కాచవరం, ఇనుపరాజుపల్లె గ్రామాలకు ఆ సమయంలో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు. విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత

పిడుగురాళ్ల ఫారెస్ట్‌ రేంజ్‌ ఆఫీసర్‌ కె.విజయకుమారి



బెల్లంకొండ: చిన్నతనం నుంచి మొక్కలు పెంచడం విద్యార్థులు బాధ్యతగా భావించాలని పిడుగురాళ్ల ఫారెస్ట్‌ రేంజ్‌ అధికారి కె.విజయకుమారి తెలిపారు. గురువారం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా పాపాయపాలెం జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అడవుల పరిరక్షణపై తల్లిదండ్రులకు విద్యార్థులు తెలియజేయాలని సూచించారు. చెట్లు నరకడం వల్ల వర్షాలు తగ్గిపోతాయని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. డీఆర్వో రమణయ్య, ఎఫ్‌బీవోలు కృష్ణమూర్తి, నరసింహారెడ్డి, రామకృష్ణ, కాశీం, సిబ్బంది జీవీఎల్‌ నాయుడు, సాంబయ్య పాల్గొన్నారు.

వలంటీర్ల వాట్సాప్‌ గ్రూపుల డీపీలను తొలగించాం

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల కోడ్‌ నేపథ్యంలో పట్టణ పరిధిలోని వలంటీర్ల వాట్సాప్‌ గ్రూప్‌ల డీపీలను తొలగించామని మున్సిపల్‌ కమిషనర్‌ కొలిమి షమ్మి గురువారం తెలిపారు. పట్టణంలో వలంటీర్లకు అధికారుల సమాచారం కోసం ఏర్పాటు చేసిన అన్ని వాట్సాప్‌ గ్రూప్‌లు, ఫేస్‌బుక్‌లలో ఎన్నికల కోడ్‌ దృష్ట్యా ప్రజాప్రతినిధుల ఫొటోలు పెట్టుకోవద్దన్నారు. గ్రూప్‌ల్లో ఎటువంటి ప్రభుత్వ సమాచారం పెట్టరాదన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై మోడల్‌ కోడ్‌ ఆఫ్‌ కాండాక్ట్‌ నిబంధనల ప్రకారం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవంగా కోదండరామ స్వామి ఆలయ ప్రతిష్ట

అమరావతి: మండల పరిధిలోని మండేపూడి గ్రామంలో గురువారం కోదండరామ స్వామి ప్రతిష్ఠ మహోత్సవంలో పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రతిష్ఠించిన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నంబూరు శంకరరావుకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేసి స్వామివారి శేష వస్త్రాన్ని బహూకరించారు.

గ్రామాల్లో పోలీసు కవాతు



రాజుపాలెం: సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్‌ వచ్చిన నేపథ్యంలో మండలంలోని అనుపాలెం, అంచులవారిపాలెం, కోట నెమలిపురి, కొండమోడు, పెదనెమలిపురి గ్రామాలలో సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్‌ బాబు ఆధ్వర్యంలో సీఐఎస్‌ఎఫ్‌ సిబ్బందితో గురువారం కవాతు నిర్వహించారు. సీఐ మీసాల రాంబాబు, ఎస్‌ఐ షమీర్‌ బాషా, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిలో మేటి గామాలపాడు

- అభివృద్ధిలో అగ్రస్థానం
- గామాలపాడులో అభివృద్ధి ప్రవాహం
- రూ.34 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి



గ్రామ సచివాలయ భవనం



వైఎస్సార్‌ రైతు భరోసా కేంద్రం



వైఎస్సార్‌ హెల్త్‌ క్లినిక్‌ భవనం



అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాల



గ్రామంలో నిర్మించిన సిమెంట్‌ రోడ్డు

దాచేపల్లి : అభివృద్ధిలో అగ్రస్థానం ఈ గ్రామం సొంతం. పల్నాటి తొలి మహిళ మంత్రిణి నాయకురాలు నాగమ్మ జన్మించిన గామాలపాడు అభివృద్ధి పథంలో దూసుకెళ్లింది. సంక్షేమం, అభివృద్ధితో ఈ గ్రామం మురిసిపోతుంది. ప్రజల చెంతనే గ్రామ సచివాలయం, వైఎస్సార్‌ రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్‌ హెల్త్‌ క్లినిక్‌ ఉండటం..ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేరటంతో గామాలపాడు గ్రామస్తులు పరవశించిపోతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల అరాచకాలు తొలగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలు రావటంతో పథకాలన్నీ లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా చేరుతున్నాయి.

సంక్షేమ ప్రవాహం..

గామాలపాడు గ్రామంలో సంక్షేమం ఒక ప్రవాహంలా ఉంది. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ ద్వారా రూ.20,55,20,926, నాన్‌ డీబీటీ ద్వారా రూ.4,57,86,306 ప్రజలకు చేరాయి. ఇవి కాక 356 మంది నిరుపేదలకు ఇంటి పట్టాల పంపిణీ జరిగింది.

అభివృద్ధి ఇలా..

గామాలపాడులో గ్రామంలో రూ.8.77 కోట్ల మేర అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయి. గత ప్రభుత్వాల కంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ గ్రామం అభివృద్ధిలో దూసుకెళ్లింది.

- రూ.45 లక్షలతో గ్రామ సచివాలయం
- రూ.23 లక్షలతో వైఎస్సార్‌ రైతు భరోసా కేంద్రం
- రూ.21 లక్షలతో వైఎస్సార్‌ హెల్త్‌ క్లినిక్‌ భవనం
- రూ.1.48 కోట్లతో ఇంటింటికి తాగునీరు
- రూ.2.15 కోట్లతో సిమెంట్‌ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం
- రూ.75 లక్షలతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- రూ.2 కోట్లతో విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ నిర్మాణానికి నిధులు మంజూరు
- రూ.1.50 కోట్లతో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు.

అభివృద్ధిలో అగ్రస్థానం..



అభివృద్ధిలో అగ్రస్థానంలో గామాలపాడు నిలిచింది. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మా గ్రామం అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రభుత్వం నుంచి నిధులు అధికంగా తీసుకువచ్చి గ్రామంలోని సమస్యలన్నింటిని దాదాపు పరిష్కరించారు. సంక్షేమం, అభివృద్ధిని చూసి గ్రామస్తులు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. మా గ్రామంలో మొత్తం కలిపి రూ.33.89 కోట్ల మేర సంక్షేమం, అభివృద్ధి జరిగింది.

– షేక్‌ ఆదాం సాహెబ్‌, ఎంపీటీసీ సభ్యుడు, గామాలపాడు

సంక్షేమంతో బాగుపడ్డాం..



జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మేము బాగుపడ్డాం. ఎస్సీ కాలనీలోని ప్రతి ఇంటికి నవరత్న పథకాలు వచ్చాయి. పిల్లలను చదివించుకోవటంతో పాటు ఆర్థికంగా బలపడటం కోసం ఈ పథకాలు మాకు ఎంతో ఉపయోగపడ్డాయి. ఇంతటి సంక్షేమం, అభివృద్ధిని చూసిన మేమంతా జగనన్నకి అండగా ఉండాలని భావిస్తున్నాం.

–పోలే సుధీర్‌, ఎస్సీ కాలనీ వాసి

కులం, పార్టీ చూడకుండా పథకాలు అందాయి..



కులాలు, మతాలు, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందించిన దేశంలోనే ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం. ఈ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే అందరికి సమన్యాయం జరుగుతుంది. ఈ ప్రభుత్వం పట్ల మా అందరికి సానుకూలత ఉంది. పథకాలు పొందిన వారంతా ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తారనేది వాస్తవం.

–చాప శేషయ్య, గ్రామస్తుడు

రక్తహీనతలేని సమాజం కోసం కృషి చేద్దాం

ఐసీడీఎస్‌ ప్రాజెక్టు అధికారి సరళ



రెంటచింతల: దేశంలో రక్తహీనతలేని సమాజం కోసం క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి సమష్టిగా కృషి చేయాలని మాచర్ల ఐసీడీఎస్‌ ప్రాజెక్టు అధికారి ఎస్‌.సరళ అన్నారు. గురువారం మండల కేంద్రమైన రెంటచింతలలో పోషణ్‌ పక్వాడా పక్షోత్సవాలలో భాగంగా జాతీయ రక్తహీనత దినోత్సవం పురస్కరించుకుని గ్రామ వీధులలో అంగన్‌వాడీ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని గర్భిణులకు, బాలింతలకు, కిశోర్‌ బాలికలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ప్రతి రోజు మనం తీసుకునే ఆహార పదార్థాలలో ఏఏ ఖనిజ సంపదలు ఉంటాయో వివరించారు. చిన్నారులకు అందించే వ్యాధి నిరోధక టీకాలు, వాటి ప్రాముఖ్యతను ఆరోగ్య కార్యకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌ ఎ.నాగమణి, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉచిత విద్యకు అర్జీలు స్వీకరణ

శావల్యాపురం: జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలు మేరకు విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రయివేటు పాఠశాలల్లో ఉచిత విద్య కోసం ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సుచరిత ఎడ్యుకేషనల్‌ సొసైటీ కార్యదర్శి కె.వి.ఆర్‌.మోహన్‌చందు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పేదలకు ప్రయివేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించారని, ఆసక్తి కలిగిన వారందరు శావల్యాపురం శ్రీరామా పబ్లిక్‌ స్కూల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీసీలకు అండగా నిలిచిన సీఎం జగన్‌

- బీసీలను రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చేసిన ఘనత జగనన్నది
- బీసీలను అణగదొక్కిన వ్యక్తి చంద్రబాబు
- వడ్డెర కార్పొరేషన్‌ చైర్‌ పర్సన్‌ దేవళ్ల రేవతి



దాచేపల్లి : జగనన్న గుండెల్లో బీసీలు ఉన్నారని వడ్డెర కార్పొరేషన్‌ చైర్‌ పర్సన్‌ దేవళ్ల రేవతి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురంలోని ఆమె క్యాంప్‌ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేవతి మాట్లాడారు. చంద్రబాబు బీసీలను ఓటు బ్యాంక్‌గా వాడుకుని అధికారం వచ్చిన తరువాత అణగదొక్కారని, జగనన్న బీసీలంటే బ్యాక్‌బోన్‌గా భావించి అన్ని విధాలుగా అండగా నిలిచారని ఆమె చెప్పారు.

సాధారణ ఎన్నికల్లో 50 శాతానికి పైగా ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించిన ఘనత సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని, బీసీలను రాజ్యాధికారులను చేసేందుకు జగనన్న శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని ఆమె అన్నారు. గత ప్రభుత్వాల్లో బీసీలు అణగదొక్కబడ్డారని, జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత కూడు, గూడు, విద్య, వైద్యంపై భరోసా కల్పించారని ఆమె పేర్కొన్నారు.

జగనన్న ప్రభుత్వం అమలు చేసిన నవరత్న పథకాల్లో రూ.1.77 లక్షల కోట్లు ఒక్క బీసీలకే వచ్చాయని, బీసీల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తున్న జగనన్నకి మేమంతా అండగా ఉంటామని చైర్‌ పర్సన్‌ రేవతి చెప్పారు. చంద్రబాబు బీసీ డిక్లరేషన్‌ని తుంగలో తొక్కారని, కానీ జగనన్న బీసీలకు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చారని గుర్తు చేశారు. టీడీపీ చేతిలో దగాపడి మోసపోయిన బీసీకులాలన్నీ జగనన్నకి అండగా ఉండేందుకు సిద్ధమయ్యాయని, బీసీలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలంటే అది ఒక్క జగనన్న వలనే సాధ్యమవుతుందని చెప్పారు. ఎన్టీఆర్‌ స్థాపించిన టీడీపీలో ఉన్న బీసీ నాయకులందరిని చంద్రబాబు తొక్కేశారని, ఒక్క కొత్త బీసీ నాయకుడిని చంద్రబాబు తయారు చేయలేదని ధ్వజమెత్తారు.

సామాన్య కుటుంబానికి చెందిన తనను రాష్ట్ర స్థాయిలో వడ్డెర కార్పొరేషన్‌కి చైర్‌ పర్సన్‌ చేశారని, అదే విధంగా చంద్రగిరి ఏసురత్నంని ఎమ్మెల్సీ చేయటంతో పాటు ఎంతోమంది వడ్డెర్లను రాజకీయంగా అభివృద్ధి చేసి, వారికి అండగా నిలిచిన మహోన్నతమైన వ్యక్తి జగనన్న అని రేవతి అన్నారు.

నేడు ఈపూరు తిరునాళ్ల



ఈపూరు : మండల కేంద్రంలోని బోటిమీద ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల శుక్రవారం జరగనుంది. ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏట కూడా దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్వామివారికి మొక్కుబడులు తీర్చుకునేందుకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని వసతులు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఎన్నికల కోడ్‌ అమలులో ఉన్నందున ఎటువంటి విద్యుత్‌ ప్రభలు నిర్మించడం లేదు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ మహమ్మద్‌ ఫిరోజ్‌ బందోబస్తు నిర్వహించనున్నారు.

ఘనంగా మానసిక వికలాంగుల దినోత్సవం

శావల్యాపురం: ప్రపంచ మానసిక వికలాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత సెంటరు నందు వరల్డ్‌ డౌన్‌ సిండ్రోమ్‌ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి బిళ్లా రాజారమేష్‌ గురువారం తెలిపారు. ఈసందర్భంగా ఎంఈవో మద్దికుంట సాంబశివరావు మాట్లాడుతూ భవిత సెంటరు నందు ఫిజియో. థెరిఫీ స్పీచ్‌ థెరిఫీ నిర్వహించుచున్నట్లు చెప్పారు. ఎంఈవో-2 పుసులూరి లలితా కుమారి మాట్లాడుతూ భవిత సెంటరు నుంచి పదోవ తరగతి పరీక్షలకు నలుగురు విద్యార్థులు హాజరు అవటం పలువురికు ఆదర్శమన్నారు. అనంతరం భవిత సెంటరు విద్యార్థులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐఆర్‌టీ ఉపాధ్యాయులు కె.జగన్‌మోహన్‌ రెడ్డి, పార్వతి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

వినుకొండ (నూజెండ్ల): పేకాట స్థావరంపై దాడి చేసి, ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ గురువారం పేర్కొన్నారు. నూజెండ్ల మండలం బుర్రిపాలెం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి, పేకాట ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి 86వేల రూపాయల నగదు, 7ద్విచక్ర వాహనాలు, 7 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

వాణిజ్య పన్నుల శాఖ అధికారిగా ‘రంగయ్య’



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల వాణిజ్య పన్నుల శాఖ అధికారిగా (సీటీవో) రంగయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. పట్టణంలోని సీటీవో కార్యాలయంలో గతంలో విధులు నిర్వహిస్తున్న పి.చంద్రయ్య బదిలీపై కమిషనర్‌ కార్యాలయానికి వెళ్లడంతో సత్తెనపల్లిలో విధులు నిర్వహిస్తున్న రంగయ్య బదిలీపై పిడుగురాళ్ల వాణిజ్య పన్నుల శాఖ అధికారి (సీటీవో)గా విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీటీవో రంగయ్య మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభ పెట్టే అభ్యర్థులపై వాణిజ్య పన్నుల శాఖ డేగ కన్ను వేసి ఉందని తెలిపారు. ఓటర్లకు పంపిణీ చేసేందుకు తాయిలాలు తెచ్చేవారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటికే పలు పార్శిల్‌ సర్వీస్‌ సంస్థల తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఓటర్లను ప్రలోభ పెట్టే అంశాలపై అధికారులందరు ప్రత్యేక విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు అభ్యర్థులు దిగుమతి చేసుకునే వస్తువుల వివరాలు తమ వాట్సాప్‌ నెంబర్‌ 9154970445కు సమాచారం అందించవచ్చని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీఎంఎస్‌ మాజీ డైరెక్టర్‌ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి

రెంటచింతల: రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రత నమోదు అవుతున్న రెంటచింతలకు వివిధ పనులపై పలు గ్రామాల నుంచి వచ్చే ప్రయాణికులు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు ఫ్రెండ్స్‌ ఇన్‌ నీడ్‌ ఫౌండేషన్‌ సభ్యులు ముందుకు వచ్చి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని డీసీఎంఎస్‌ మాజీ డైరెక్టర్‌ మద్దిరాల కృష్ణారెడ్డి అన్నారు. గురువారం స్థానిక మీ–సేవా కేంద్రం వద్ద జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభించి మాట్లాడారు. మండుతున్న ఎండలకు 90 రోజుల పాటు చల్లటి మంచినీటిని పంపిణీ చేసేలా ఫ్రెండ్స్‌ ఇన్‌ నీడ్‌ ఫౌండేషన్‌ సభ్యులు చర్యలు చేపట్టడం సంతోషకరమన్నారు. రెంటచింతలలో విధులు నిర్వహించి అకాల మృతి చెందిన ఆంధ్రాబ్యాంక్‌ మేనేజర్‌ టి.వి.జగన్నాధరావు స్ఫూర్తిగా ఏర్పాటు చేసిన ఈ స్వచ్ఛంద సంస్థ 6 సంవత్సరాలుగా ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, ఫ్రెండ్స్‌ ఇన్‌ నీడ్‌ ఫౌండేషన్‌ అధ్యక్షుడు పేరం చెన్నారెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి కె.రంగనాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పమ్మి సీతారామిరెడ్డి, పాతపాటి పిచ్చిరెడ్డి, నవులూరి చెన్నారెడ్డి, ఉమ్మా సైదారెడ్డి, కొండా రామయ్య, ఓర్సు కాశయ్య, పేరం రంగారెడ్డి, ఫౌండేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

దళితుడిని దుర్భాషలాడిన కమిషనర్‌ను తొలగించాలి

జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్‌ మానిటరింగ్‌ కమిటీ

క్రోసూరు: జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్‌ మానిటరింగ్‌ కమిటీ సభ్యుడు కోట సుబ్బును చిలకలూరిపేట మున్సిపల్‌ కమిషనర్‌ దుర్భాషలాడటమే కాక అతనిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తూ వెంటనే మున్సిపల్‌ కమిషనర్‌ను విధులనుంచి తొలగించాలంటూ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్‌ కమిటీ గురువారం డిమాండ్‌ చేసింది. ఈ సందర్భంగా కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి దాసు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బుధవారం మధ్యాహ్నం పల్నాడు జిల్లా డీవీఎంసీ మెంబర్‌ కోట సుబ్బు మాదిగ దళితుల సమస్యలపై చిలకలూరిపేట మున్సిపల్‌ కమిషనర్‌కు అర్జీ ఇవ్వటానికి వెళ్లగా కమిషనర్‌ కోపంతో ఊగిపోతు అపాయింట్‌మెంట్‌ లేకుండా లోపలికి ఎవరు రానిచ్చారంటూ చులకన చేసి మాట్లాడటం జరిగిందన్నారు. తాను జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్‌ కమిటీ సభ్యుడనని కోట సుబ్బు మాదిగ తెలుపుతుండగా కమిషనర్‌ ఇష్టం వచ్చినట్టు రెచ్చిపోయి కోట సుబ్బు మాదిగ పై విరుచుకుపడి నోటికొచ్చినట్టు మాట్లాడడం జరిగిందన్నారు. ఈవిషయమై ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌ స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు స్పందించకపోవడం విడ్డూరన్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్‌ కమిషనర్‌ సాయంత్రం 8 గంటల సమయంలో కోటా సుబ్బు మాదిగ పై ఎదురు కంప్లైంట్‌ ఇవ్వటం జరిగిందన్నారు. దళితుల సమస్యలపై అర్జీ ఇచ్చేందుకు వెళ్లిన దళిత నేతను దుర్భాషలాడడమే కాకుండా, పోలీసులకు ఫిర్యాదు చేయడాన్ని జిల్లా డీవీఎంసీ కమిటీ పూర్తిగా ఖండిస్తుందన్నారు. జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్‌ అండ్‌ మానిటరింగ్‌ కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షుడు పట్టపు మరియ దాస్‌, బంకా శ్రీనివాసరావు పాల్గొన్నారు .

జీవకోటి మనుగడకు చెట్లు ముఖ్యం



కళాశాలలో మొక్క నాటుతున్న రామచంద్రరావు

వినుకొండ టౌన్‌: జీవకోటి మనుగడకు చెట్లు ఎంతో దోహదపడతాయని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్‌. రామచంద్రరావు పేర్కొన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని, పట్టణంలోని శ్రీమతి గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సృష్టిలోని సకల జీవ కోటి బ్రతకాలంటే గాలి అవసరమని, అటువంటి గాలినిచ్చే చెట్టను, పర్యావరణాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైన ఉందన్నారు. అంతేకాకుండా చెట్లు నాటడం వలన కలిగే మరిన్ని ప్రయోజనాలను, కళాశాల ఆవరణలో మొక్కలను నాటి విద్యార్థులకు వివరించారు. అనంతరం వెల్లటూరు రోడ్డులో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న నగరవనాన్ని సందర్శించి, పనులను పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్‌ రేంజ్‌ అధికారి సయ్యద్‌ హుస్సేన్‌, డిప్యూటీ రేంజ్‌ అధికారి సురేంద్రబాబు, ఫారెస్ట్‌ బీట్‌ అధికారి, అటవీ శాఖ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్‌ కె. శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారు

- ఈ నెల 24, 25 తేదీల్లో జాతర
- ఆలయ అభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రభుత్వ విప్‌ పీఆర్కే



శ్రీలక్ష్మీ అమ్మవారి మూలవిరాట్‌



రాజగోపురం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్‌ పీఆర్కే (ఫైల్‌ ఫొటో)

దుర్గి: దుర్గి మండలం, అడిగొప్పల గ్రామ సమీపంలోని నిదానంపాడులో వెలసిన నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం ఈ నెల 24, 25 ఆది, సోమవారాలలో ఘనంగా నిర్వహించుటకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర స్థాయిలో వివిధ దేవాలయాల సరసన నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయానికి ప్రత్యేక స్థానం దక్కేందుకు కోట్లాది రూపాయలు వెచ్చించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి అగ్రస్థానం చేరుకోవటం చాలా సంతోషంగా ఉందని పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్‌, ప్రభుత్వ విప్‌ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రూ. 2.50 కోట్లతో ఐదంస్తుల రాజగోపురం, అన్నదానం బిల్డింగ్‌ ముందు రూ.25 లక్షలతో సీసీరోడ్డు, పోటు బిల్డింగ్‌ నుంచి దేవాలయం వరకు సీసీ రోడ్డు రూ.22 లక్షలు, గోశాల ముందు సీసీ రోడ్డుకు రూ.5 లక్షలు, కేశఖండన శాలకు సీసీ రోడ్డుకు రూ.5 లక్షలు, భక్తులకు కాటేజీలు, రూ.1.20 కోట్లతో విశాలమైన భోజనశాల, అడిగొప్పల ఆర్చి నుంచి అమ్మవారి ప్రధాన ఆలయానికి వెళ్లే రహదారిలో వంతెన నిర్మాణం చేపట్టారు. సీఎం జగన్‌ అధికారం చేపట్టినప్పటి నుంచి కోట్లాది రూపాయల వ్యయంతో మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మవారి తిరునాళ్లకు కుంకుమ బండ్లు ప్రత్యేక ఆకర్షణ..

అడిగొప్పల, ఓబులేశునిపల్లె, నరమాలపాడు, వివిధ గ్రామాల నుంచి కుంకుమ బండ్లు సుమారు 30కి పైగా రానున్నాయి. ఒక్కో బండిని రూ.3, 4 లక్షల వ్యయంతో గ్రామస్తులు ఏర్పాటు చేస్తారు. తమ గ్రామాల నుంచి బయలుదేరే క్రమంలో నియమ నిష్ఠలతో పూజలు చేసి ఎటువంటి విఘ్నం కలగకుండా అందరూ ఏకతాటిపై బండిని ఆలయం వద్దకు తీసుకొని వచ్చి మూడు ప్రదక్షిణలు చేసి తమ భక్తిని చాటుకుంటారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి భక్తులు లక్షలాదిగా పాల్గొంటారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు కొలువుదీరనున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా మాచర్ల, పిడుగురాళ్ల డిపోల నుంచి బస్సుల సౌకర్యం ఏర్పాటు చేశారు.

తూనికలు, కొలతలశాఖ అధికారుల దాడులు



తూనికలు పరిశీలిస్తున్న మాధురి

చిలకలూరిపేటటౌన్‌: తూనికలు, కొలతల శాఖ అధికారులు గురువారం పట్టణంలోని పలు దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిబంధనలు పాటించని షాపులపై 47 కేసులు నమోదు చేశారు. గుంటూరు జిల్లా తూనికలు, కొలతల శాఖ సంయుక్త అధికారిణి ఎంఎస్‌ఎస్‌ మాధురి ఆధ్వర్యంలో పట్టణంలోని చికెన్‌, కిరాణా, బంగారం దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కాలం చెల్లిన కాటాలను వినియోగించరాదని, ప్రతి ఏడాది రెన్యువల్‌ చేయించుకోవాలని సూచించారు. బియ్యం 25 కేజీల బ్యాగుల తూనికల్లో వ్యత్యాసం కనిపిస్తుందని, వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. దాడుల్లో గుంటూరు జిల్లా తూనికలు, కొలతల శాఖ ఉపసంయుక్త అధికారి షాలేమురాజు, అధికారులు కొండారెడ్డి, అల్లూరయ్య, ఇన్‌స్పెక్టర్లు శివశంకర్‌, సునీల్‌రాజ్‌, జాన్‌సైదా, శేషసాయి పాల్గొన్నారు.